బీసీజీ వ్యాక్సినేషన్‌కు స్పందన కరవు

- టీకా వేసుకునేందుకు వృద్ధుల నిరాసక్తత
- అవగాహన కల్పించడంలో అధికారుల వైఫల్యం
- లక్ష్య సాధన కోసం వైద్య సిబ్బంది కుస్తీ


బుచ్చిరాజుపాలెం యూపీహెచ్‌సీలో టీకా వేస్తున్న ఏఎన్‌ఎం


ఇంటి వద్దకు వెళ్లి వ్యాక్సిన్ వేస్తున్న ఏఎన్‌ఎం

విశాఖ విద్య: క్షయ వ్యాధి(టీబీ) నివారణ కోసం చేపట్టిన బీసీజీ వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్ ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. 60 ఏళ్ల దాటిన వారికి టీబీ సోకే ప్రమాదం ఎక్కువగా ఉందనే వైద్య నిపుణుల హెచ్చరికలతో అప్రమత్తమైన వైద్య ఆరోగ్య శాఖ వ్యాక్సినేషన్‌పై దృష్టి సారించింది. సచివాలయాల స్థాయిలో నిర్వహించిన సమగ్ర సర్వేలో గుర్తించిన 60 ఏళ్ల దాటిన వృద్ధులందరికీ బీసీజీ వ్యాక్సినేషన్ వేయాలనే లక్ష్యంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్‌కు శ్రీకారం చుట్టారు. పశ్చిమ నియోజకవర్గంలోని యూపీహెచ్‌సీల్లో ప్రస్తుతం ఈ కార్యక్రమం జోరుగా సాగుతోంది. సచివాలయాన్ని యూనిట్‌గా తీసుకొని ప్రతీ సోమ, గురువారాల్లో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి బీసీజీ టీకా వేస్తున్నారు.

లక్ష్యానికి ఆమడ దూరం

వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు ఆదేశించినా.. క్షేత్రస్థాయిలో బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమానికి సరైన స్పందన లభించడం లేదు. బుచ్చిరాజుపాలెం యూపీహెచ్‌సీ పరిధిలో 6 వేల మందికి టీకా వేయాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 1,592 మందికి టీకా వేశారు. నియోజకవర్గంలోని మిగతా ఆరోగ్య కేంద్రాల పరిధిలో పరిస్థితి మరీ దారుణంగా ఉన్నట్లు తెలుస్తోంది. నిన్న మొన్నటి వరకూ సచివాలయాల్లో మాత్రమే టీకా వేసేవారు. ఉన్నతాధికారుల ఒత్తిళ్లతో క్యారియర్ చేతపట్టుకొని సచివాలయ ఆరోగ్య కార్యదర్శులు(ఏఎన్‌ఎం), ఆశ కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి వ్యాక్సిన్లు వేస్తున్నారు. అయినప్పటికీ ప్రజలు ముందుకు రాకపోవడంతో టీకా పంపిణీలో పురోగతి కనిపించడం లేదు.

ఉచిత టీకాపై అవగాహన కల్పించకపోతే ఎలా..

క్షయ వ్యాధి నివారణ కోసమని ఉచితంగానే టీకా వేస్తున్నప్పటికీ దీనిపై ప్రజల్లో అనేక అపోహలున్నాయి. టీకా వేసుకున్న వారి చేతికి పుండు కలగటం, నీరసంగా ఉండటంతో దీనిపై నిరాసక్తత వ్యక్తం చేస్తున్నారు. కరోనా టీకా మాదిరే స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులు టార్గెట్‌లు పెడుతుండటంతో క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న సిబ్బంది తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. 'తాంబూలం ఇచ్చేశాం తన్నుకు చావండి' అన్న సామెత మాదిరే.. వ్యాక్సినేషన్ పంపిణీ వరకే తమ బాధ్యత అన్నట్లుగా జిల్లా ఉన్నతాధికారులు వ్యవహరిస్తున్నారు. వ్యాక్సినేషన్‌పై ప్రజానీకంలో అవగాహన కల్పించేందుకు శ్రద్ధ తీసుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఉన్నతాధికారులు దృష్టి సారించి బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమం చురుగ్గా జరిగేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

టీకా వేసుకుంటేనే మేలు



టీబీ వ్యాధి సోకకుండా 60 ఏళ్లు నిండిన వారంతా తప్పనిసరిగా బీసీజీ టీకా వేసుకోవాలి. వ్యాక్సిన్ వేసుకున్న వారి చేతికి పుండు వస్తున్నా, ఇది నెల రోజుల్లో మానిపోతుంది. అలా రావటం కూడా మందు పనిచేస్తున్నట్లుగానే భావించాలి. మా యూపీహెచ్‌సీ పరిధిలో లక్ష్యసాధనకు సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నాం. దీనిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

– డాక్టర్ రొంగలి రేవతి, యూపీహెచ్‌సీ బుచ్చిరాజుపాలెం

క్లుప్తంగా

ఉత్సాహంగా విండ్‌బాల్ క్రికెట్ పోటీలు


క్రీడాకారులతో రామ్మోహన్‌నాయుడు, కాశీ

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు వెంకన్నపాలెంలో యాదవ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం విండ్‌బాల్ క్రికెట్ పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. వీటిని తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామ్మోహన్‌నాయుడు ప్రారంభించి మాట్లాడారు. శ్రీకృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకుని స్థానిక యాదవ యువత ఈ పోటీలను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. యువతకుఅండగా ఉంటానని, విద్య, క్రీడా రంగంలో రాణించి గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. స్థానిక యువజన నాయకుడు కాశీయాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యాదవ సంఘం ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

రాంగ్ పార్కింగ్‌పై కొరడా


సింహాచలం రైల్వే స్టేషన్‌లో జరిమానాలు విధిస్తున్న ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ మమత

గోపాలపట్నం: సింహాచలం రైల్వే స్టేషన్‌లో రాంగ్ పార్కింగ్ చేసిన వాహనాలపై ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ కొరడా ఝుళిపించారు. సింహాచలం రైల్వే స్టేషన్‌కు వివిధ పనుల నిమిత్తం వచ్చిన వారు, ఇక్కడి పార్కింగ్‌లో కాకుండా బయట వాహనాలు పెట్టి రెండు మూడు గంటల వరకు రాకపోవడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. స్టేషన్ లోపలికి వెళ్లే దారిలేక వారి పడుతున్న ఇబ్బందులను చూసి ఎస్‌ఐ మమత రాంగ్ పార్కింగ్ వాహనాలకు జరిమానాలు విధించారు. స్టేషన్ పరిధిలో ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలపరాదని, తప్పనిసరిగా పార్కింగ్‌లో ఉంచుకోవాలని సూచించారు. కానిస్టేబుల్ సోనాలి, సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు


అంత్యక్రియలు నిర్వహిస్తున్న మమత

విశాఖ విద్య: కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన వ్యక్తికి బంధువులెవ్వరూ లేకపోవడంతో బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత మానవతా దృక్పథంతో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. కంచరపాలెం సమీపంలోని చేపల మార్కెట్ వద్ద ఉంటున్న అనాథ వృద్ధుడిని బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్‌కు తీసుకొచ్చి ఆశ్రయం కల్పించారు. అతడి ఆరోగ్య పరిస్థితి బాగా లేకపోవడంతో కేజీహెచ్‌కు తీసుకెళ్లి వైద్యం అందించేలా మమత శ్రద్ధ తీసుకున్నారు. అతడి వృద్ధాప్యం దృష్ట్యా ఆరోగ్య పరిస్థితి విషమించటంతో మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. బంధువులు ఎవ్వరూ లేకపోవటంతోనే షెల్టర్ మేనేజర్ మమత స్పందించి ఆదివారం జ్ఞానాపురం శ్మశానవాటికలో వృద్ధుడి మృతదేహానికి శాస్త్రోక్తంగా అంత్యక్రియలు జరిపించారు.

'బీఎస్ 6'పై అవగాహన

గాజువాక: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిబంధనల మేరకు విడుదలైన భారత్ స్టేజ్(బీఎస్) 6 ద్విచక్ర వాహనాలపై మెకానిక్‌లకు అవగాహన కల్పించారు. ప్రగతి టూవీలర్ మెకానిజం వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన శిక్షణలో అసోసియేషన్ కార్యదర్శి అప్పారి విష్ణుమూర్తి బీఎస్ 6 సాంకేతికతను వివరించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి


కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న మహిళలు

మల్కాపురం: కోల్‌కతాలో విధుల్లో ఉన్న ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారం చేయడం దారుణమని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) కార్యదర్శి ఆర్.విమల ఆవేదన వ్యక్తం చేశారు. ఐద్వా మల్కాపురం డివిజన్ ఆధ్వర్యంలో 59వ వార్డు నెహ్రూ నగర్‌లో ఆదివారం సాయంత్రం కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక మహిళా వైద్యురాలిపై సామూహిక అత్యాచారం, హత్యకు పాల్పడిన మానవ మృగాలను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వైద్యురాలి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా మహిళా సంఘం ప్రతినిధులు కె.లక్ష్మీదేవి, జ్యోతి, సీతమ్మ, కనకమ్మ, బేబి, విజయ, చంద్రమ్మ, గుర్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసరావుకు పరామర్శ


శ్రీనివాసరావుతో మాట్లాడుతున్న మళ్ల విజయప్రసాద్

కంచరపాలెం: వైఎస్సార్‌సీపీ 57వ వార్డు అధ్యక్షుడు, సీనియర్ నాయకుడు చీటిమిరెడ్డి శ్రీనివాసరావు ఇటీవల గుండెకు ఆపరేషన్ చేయించుకున్నారు. తుమ్మడపాలెంలోని ఆయన నివాసానికి ఆదివారం మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్, కార్పొరేటర్ ముర్రు వాణి వెళ్లి పరామర్శించారు. త్వరగా ఆరోగ్యం కోలుకోవాలని, అధైర్య పడవద్దన్నారు. ఏ సహాయం కావాలన్నా చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ముర్రు నానాజీ, బాకీ శ్యామ్‌కుమార్‌రెడ్డి, వార్డు అధ్యక్షుడు పిన్నింటి అప్పలరాజు, మళ్ల సతీష్, కన్వీనర్ కొత్తూరు శ్రీను, రవి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పోలమ్మవారి పండగ


అమ్మవారి పుట్టమన్నును తలపై పెట్టుకుని తీసుకొస్తున్న భక్తులు


ఊరేగింపులో సాంస్కృతిక ప్రదర్శన

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం హరిజన వీధిలో కొలువైన పోలమ్మ అమ్మవారి పండగను ఆదివారం స్థానికులు వైభవంగా జరుపుకున్నారు. అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు, పసుపు, కుంకుమలతో అభిషేకాలు చేశారు. ఆలయం నుంచి మల్కాపురం మహాలక్ష్మి థియేటర్ ఎదురుగా గల మైదాన ప్రదేశం వరకు భక్తులు ఊరేగింపుగా వెళ్లి అక్కడ పుట్టమన్ను తీసుకొచ్చి తల్లి పీఠం వద్ద ఉంచి ఉత్సవాలు ప్రారంభించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ పండగ మూడు రోజుల పాటు జరుగుతుంది. మంగళవారం సాయంత్రం అమ్మవారి ఊరేగింపు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

కావాలనే 'ఉక్కు' నిర్వీర్యం

అగనంపూడి: విశాఖ ఉక్కు స్టీల్‌ప్లాంట్ రాష్ట్ర ప్రజల ఆస్తిగా భావిస్తున్నామని, లక్షల మందికి ప్రత్యంగా, పరోక్షంగా ఉపాధి కల్పించే సంస్థను కేంద్ర ప్రభుత్వం తనకు నచ్చిన వారికి కట్టబెట్టాలని చూస్తే ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదని, ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని జీవీఎంసీ కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో కొనసాగుతున్న రిలే దీక్షా శిబిరంలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 32 మంది అమరుల త్యాగఫలితం విశాఖ ఉక్కు కర్మాగారమన్నారు. తెలుగు ప్రజల మనోభావాలతో ముడిపడి ఉన్న స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించాలని భావిస్తే ఛీత్కారం తప్పదన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోమటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఐదేళ్ల క్రితం లాభాలతో పయనించిన విశాఖ ఉక్కును పరిపరి విధాలుగా ఇబ్బందులకు గురిచేసి నేడు ఉత్పత్తిని హీనస్థితికి తీసుకువెళ్లడం, కేవలం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టడానికేనని ప్రజలకు తెలుసన్నారు. ముడి సరుకును సరఫరా చేయకుండా చివరికి ఉత్పత్తి నిలిపివేసే స్థితికి తీసుకువెళ్లడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ముడి సరుకు సరఫరా చేసి సొంత గనులు కేటాయించాలని, తక్షణ సాయంగా రూ.3వేల కోట్ల నిధులు విడుదల చేయాలని కోరారు. పోరాట కమిటీ నాయకులు బొడ్డు పైడిరాజు, డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, ఎస్.రామారావు, వరసాల శ్రీనివాసరావు, నీరుకొండ రామచంద్రరావు, కరణం సత్యారావు, ఎం.కె.రెడ్డి, కె.పరంధామయ్య, ఎల్లేటి శ్రీను, కార్పొరేటర్ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కళానైపుణ్య పోటీలు


పాట్ పెయింటింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు,


ఓ విద్యార్థిని తయారు చేసిన కళాకృతి

కొమ్మాది: శ్రీ కృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని ఇస్కాన్ మందిరంలో ఆదివారం నిర్వహించిన కళానైపుణ్య పోటీలకు విశేష స్పందన లభించింది. నగరం నలుమూలల్లోని అనేక పాఠశాలల నుంచి వందలాది మంది విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస్ ప్రభుజీ, మాతాజీ నితాయి సేవిని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు ఇస్కాన్‌లో వైభవంగా జన్మాష్టమి వేడుకలు నిర్వహించనున్నామని, ఈ నేపథ్యంలో విద్యార్థుల కోసం అనేక ఆకర్షణీయమైన పోటీలు నిర్వహించామని తెలిపారు. పాట్ పెయింటింగ్, వ్యాసరచన, డ్రాయింగ్, శ్రీకృష్ణ లీలలపై పరీక్ష, భగవద్గీత శ్లోకాల పారాయణం, వంట, పూల అలంకరణ, రంగోలి తదితర పోటీలు నిర్వహించామని, విజేతలకు కృష్ణాష్టమి నాడు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

జేసీఐ విశాఖ అచీవర్స్ సెమినార్


సెమినార్‌లో పాల్గొన్న వివిధ సంఘాల ప్రతినిధులు

దాబాగార్డెన్స్: నగరంలోని ఓ హోటల్‌లో జేసీఐ విశాఖ అచీవర్స్ నేతృత్వంలో ఆదివారం ఓరియంటేషన్ సెమినార్ నిర్వహించారు. విశాఖ జోన్ ప్రెసిడెంట్ సురేష్ గొంప సదస్సును ప్రారంభించి మాట్లాడారు. జేసీఐ విశాఖ చాప్టర్ పరిధిలో పనిచేస్తున్న పలు సంఘాల ప్రతినిధులు సేవలు ఏ విధంగా గుర్తించాలి? అవార్డులు ఎలా ఎంపిక చేయాలనే విషయాన్ని సభ్యులకు తెలియజేశారు. మేనేజ్‌మెంట్ జెడ్ డి.రూప సిరిపూరి మాట్లాడుతూ జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ ప్రస్తుతం ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతోందని, వాటిని ప్రజలకు వివరించడంతో పాటు అవార్డులు అందుకునే స్థాయికి ఏ విధంగా తీసుకెళ్లాలనే అంశంపై జేసీఐ అచీవర్స్ ప్రెసిడెంట్ దిలీప్‌కుమార్ నేతృత్వంలో శిక్షణ అందివ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జేసీఐ వైస్ ప్రెసిడెంట్ అనురాధ్ సిస్టలా, జోనల్ చైర్‌పర్సన్ సింధూర తాడి, ప్రాజెక్ట్ డైరెక్టర్ సోమశేఖర్, బి.దిలీప్‌కుమార్, రంజిత్ షా, డాక్టర్ శీతల్ మదన్, ఉమా, శ్రీదేవి, విజయ కిరణ్, పర్వీన్, చంద్రశేఖర్, ప్రేరణ మదన్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళాలు


సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణకు చెక్కు అందజేస్తున్న దాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి ఆదివారం సింహాచలం దరి ప్రహ్లాదపురం ప్రాంతానికి చెందిన మహంతి వెంకటలక్ష్మి లక్ష 116 రూపాయాల విరాళాన్ని, దాబా గార్డెన్స్‌కి చెందిన చెక్కరాజు, ప్రసాద్ కలిసి లక్ష 116 రూపాయల విరాళాన్ని అందజేశారు. సంబంధిత విరాళాలను అన్నప్రసాద విభాగం ఏఈవో పాలూరి నరసింగరావుకి, ప్రోటోకాల్ సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణకు చెక్కుల రూపంలో అందజేశారు. దేవస్థానం తరఫున దాతల కుటుంబాలకు దేవస్థానం అధికారులు దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

అనుబంధాల వేడుక.. రక్షాబంధన్



ఎన్‌ఏడీ ప్రాంతంలో రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు

మార్కెట్‌కు రాఖీ పండగ శోభ


ఎన్‌ఏడీ జంక్షన్‌లో రాఖీ స్టాల్


గోపాలపట్నం స్వీట్స్ షాప్‌లో జనం సందడి

విశాఖ విద్య/గోపాలపట్నం: అక్కా–తమ్ముడు.. అన్నా–చెల్లెళ్ల ఆప్యాయతలను పంచుకునే పండగ రానేవచ్చింది. సోదర ప్రేమకు చిహ్నంగా రాఖీ కట్టడం అనాదిగా వస్తోంది. తండ్రి తరువాత ఆ స్థానంలో తమకు తోడుగా నిలిచే సోదరుడు ఆరోగ్యం మెండుగా ఉండాలని కోరుకునే అక్కచెల్లెమ్మలు రాఖీలు కట్టేందుకు అంతా సిద్ధం చేసుకున్నారు. సోమవారం రాఖీ పౌర్ణమి కావడంతో మార్కెట్‌లో సందడి కనిపించింది. సామాజిక మాధ్యమం జోరు మీద ఉన్నప్పటికీ, యువతలో ట్రెండ్ మారుతుందనే చెప్పాలి. వాట్సాప్...ఫేస్‌బుక్‌లో రాఖీ శుభాకాంక్షలు చెప్పే కంటే, తామే స్వయంగా వెళ్లి తన సోదరుడి చేతికి రాఖీ కట్టాలనే తపన అక్కచెల్లెమ్మల్లో కనిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే మార్కెట్‌లో రాఖీ విక్రయాల దుకాణాలు విరివిగా వెలిశాయి. రాఖీల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఎన్‌ఏడీ సెంటర్, బాజీ జంక్షన్, గోపాలపట్నం, కరాస, మర్రిపాలెంలో రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన రాఖీ విక్రయాల స్టాళ్ల వద్ద ఆదివారం మహిళలు సందడి చేశారు. స్వీట్స్ దుకాణాల్లో మిఠాయిలు కొనుగోలు చేసేందుకు జనం ఎగబడ్డారు. రూ.10 నుంచి రూ.350 వరకు రాఖీలు విక్రయిస్తున్నామని ఓ దుకాణదారుడు తెలిపాడు. సోమవారం విక్రయాల జోరు మరింత పెరిగే అవకాశం ఉంది. స్వీట్స్ దుకాణాల్లోనూ నోరూరించే మిఠాయిలను సిద్ధం చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


పూర్వ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న 1987–88 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

గోపాలపట్నం: గోపాలపట్నం ఎస్‌వీఎల్‌ఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1987–88 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆత్మీయంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కె.అప్పారావు, నాటి ఉపాధ్యాయులు లక్ష్మీకుమారి, లక్ష్మీనారాయణ, ప్రేమకుమారి, ఉషారాణి, జగదాంబ, వజ్రావతి, నాగమణి, శాంతకుమారి, నిర్మలను ఘనంగా సత్కరించారు. విశ్రాంత హెచ్‌ఎం మాట్లాడుతూ తమ దగ్గర చదువుకుని ఎంతో ప్రయోజకులుగా మారిన పూర్వ విద్యార్థులందరినీ చూసి చాలా సంతోషంగా ఉందన్నారు. గురువులను గుర్తుంచుకుని పాత జ్ఞాపకాలను నెమరువేసుకునే అవకాశం కల్పించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఆనాటి ఉపాధ్యాయులను మళ్లీ కలవడం ఆనందంగా ఉందన్నారు. జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మాట్లాడుతూ పాఠశాలలోకి అడుగుపెట్టగానే ఒళ్లు పులకరించిందన్నారు. ఆనాటి అల్లరి వేషాలన్నీ గుర్తుకువచ్చాయని తెలిపారు. బాల్యం మరుపురాని అనుభూతులను మిగుల్చుతుందన్నారు. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఎన్.చంద్రశేఖర్, ప్రసన్న మాస్టర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అందరికీ జ్ఞాపికలు అందించారు.

ఆటపాటలతో అలరించిన కళాకారులు


కోలాట ప్రదర్శనలో చిన్నారులు

మల్కాపురం: గాజువాక మూవీ ఆర్టిస్టుల అసోసియేషన్(జీమా) ప్రథమ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీకృష్ణ యాదవ కల్యాణ మండపంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్‌రావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సినీ కళాకారులకు తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. గాజువాక, పారిశ్రామిక ప్రాంత కళాకారుల కోసం అవసరమైన భవనాన్ని త్వరలో అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కళాకారులు పలు చిత్రాల్లోని పాటలు పాడి అలరించారు. చిన్నారులు చేసిన కోలాట ప్రదర్శన, వినోద కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నటులు సత్తిపండు(జబర్దస్త్ ఫేమ్), షేక్ శ్రీను, డ్యాన్సర్ ఝాన్సీ, జీమా అధ్యక్షుడు గుడివాడ శ్రీనివాస్‌రావు, వైస్ ప్రెసిడెంట్ బాలకుమార్, కార్యదర్శి పైడిరాజు యాదవ్ నూనెల, కోశాధికారి ఊకోటి వెంకటేశ్వరరావు(నాని) తదితరులు పాల్గొన్నారు.

పోలమాంబ పండగ మహోత్సవాలు ప్రారంభం


అమ్మవారిని దర్శించుకుంటున్న మళ్ల విజయప్రసాద్ తదితరులు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు హరిజన వీధిలో కొలువైన పోలమాంబ అమ్మవారి పండగ మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి విగ్రహాన్ని నెలకొల్పి 30 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేశారు. మూడు రోజుల పాటు ఉదయం 5 గంటల నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా అమ్మవారిని ముఖ్య అతిథి మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారికి మొక్కులు సమర్పించుకుని పాత్రులు కావాలని కమిటీ సభ్యులు కోరారు. కార్యక్రమంలో 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మనరావు, భీశెట్టి గణేష్, కేబుల్ వాసు, సీనియర్ ప్రాతికేయులు ముప్పిడి గిరి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

జూలో రెడ్ నెక్డ్ వాల్లబీ సందడి


యానిమల్ కీపర్‌కు దూరంగా పరిగెడుతున్న రెడ్ నెక్డ్ వాల్లబీ

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కు ఆదివారం సందర్శకులతో కళకళలాడింది. వన్యప్రాణులు ఎన్‌క్లోజర్లలో హుషారుగా తిరుగుతూ కనువిందు చేశాయి. ఇక్కడ రెడ్ నెక్డ్ వాల్లబీ ఎన్‌క్లోజర్‌లో గెంతులు వేస్తూ.. అటూ ఇటూ పరిగెడుతూ సందర్శకులను మరింతగా ఆకట్టుకుంది. ఇటీవల గుజరాత్ జూ నుంచి ఒక జత రెడ్ నెక్డ్ వాల్లబీని జూ అధికారులు ఇక్కడికి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. వాటి కోసం ప్రత్యేకంగా ఎన్‌క్లోజర్‌ను సిద్ధం చేశారు. దానిలో ఆదివారం యానిమల్ కీపర్ ఆహారం(పచ్చని ఆకులు) అందించే సమయంలో వాల్లబీలు పరుగులు తీశాయి. యానిమల్ కీపర్‌కు దూరంగా ఎన్‌క్లోజర్ లోపల అమర్చిన దుంగల మీదుగా ఎగురుతూ పరిగెడుతూ సందడి చేశాయి.